క్లుప్తంగా

సప్త శనివార వ్రత పూజలు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

సింహాద్రిపురం: మండలంలోని సింహాద్రిపురం లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సప్త శనివారాల వ్రత పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్‌శర్మ, అర్చకులు పవన్ కుమార్ శర్మ గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామికి పంచామృత అభిషేకం, మహా మంగళహారతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గుండె వైద్య నిపుణుల రాక

పులివెందుల: పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి వైద్య చికిత్స అందిస్తారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గుండె సంబంధిత జబ్బులతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ.దినేష్‌రెడ్డి తెలిపారు. అలాగే దినేష్ మెడికల్ సెంటర్‌లో నూతనంగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించామని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

చింతకొమ్మదిన్నె: సీకే.దిన్నె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవనంలో నిర్వహిస్తున్నట్లు చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన పురోగతి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

చింతకొమ్మదిన్నె: చింతకొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రముఖ వైద్యులు బీవీ.శివారెడ్డి, రవిశంకరరెడ్డి ఆధ్వర్యంలో చెక్కర వ్యాధి, రక్తపోటు పరీక్షలు చేయనున్నారు. డాక్టర్ బీవీ శివారెడ్డి చిన్న పిల్లలు, పురిటి పిల్లలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నారు. అలాగే డాక్టర్ వి.రవిశంకరరెడ్డి ఎముకలు, కీళ్ళు, వెన్నెముక సమస్యలున్న వారిని పరీక్షించి మందులు ఇవ్వనున్నారని నిర్వాహకులు తెలిపారు. చుట్టు ప్రక్కల గ్రామస్తులు కూడా ఈ శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు.

రక్తదాన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, తదితరులు

ప్రొద్దుటూరు క్రైం: స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ వార్షిక రక్తదాన వారోత్సవాల పోస్టర్‌ను శనివారం జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ గోపాల్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ రక్తదానం ఒకరి ప్రాణం కాపాడుతుందన్నారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని చెప్పారు. రక్తం ఎవరైనా ఇవ్వచ్చనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను వైద్యాధికారులు అభినందించారు.

నేడు పల్లా జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభ

ప్రొద్దుటూరు: అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పల్లా జాతీయ పురస్కారం-2025 ప్రదానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు యువ సాహితీ సేవా సంస్థ వ్యవస్థాపకుడు పల్లా కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సినీ, టీవీ సీరియల్ గేయ రచయిత మానశ్రీ మల్లిక్ రచించిన మంటలు స్నానం కవితా సంపుటికి పల్లా జాతీయ పురస్కారం -2025 అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కవితా సంపుటిని సాహితీ విమర్శకులు, న్యాయవాది సీవీ సురేష్ సమీక్షిస్తారని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు, కొనిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ప్రముఖ అనువాద రచయిత డాక్టర్ కొమ్మిశెట్టిమోహన్ హాజరవుతారన్నారు.

ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా కమిటీ

కడప ఎడ్యుకేషన్ : ఆమ్ ఆద్మీపార్టీ బలోపేతం దిశగా జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పార్టీ జిల్లా కన్వీనర్‌గా సాజిద్ హుసేన్, కో కన్వీనర్‌గా దాదాపీర్, కోఆర్డినేటర్‌గా రహమతుల్లా, ట్రెజరర్‌గా డాక్టర్ బేరిలా శ్రీనివాసులు, కార్యదర్శులుగా ఫైజ్ దస్తగిరి, యూత్ వింగ్ ప్రతినిధిగా ఆరీఫ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

పడకేసిన పర్యాటకం

కడప జిల్లాలో పర్యాటక సంస్థ సేవలు పడకేశాయి. పర్యాటకుల కోసం పాతకడప చెరువులో మూడు బోట్లు ఏర్పాటు చేసి పిల్లలు, పెద్దలను చెరువులోకి షికారుకు తీసుకుపోయేవారు. పర్యాటక శాఖ అధికారులు దీనిని సక్రమంగా నిర్వహించకపోవడంతో ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా తగ్గిపోయింది. దీంతో వేల రూపాయలు పెట్టి కొన్న బోట్లు ఇలా నిరుపయోగంగా పడి ఉన్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







కార్మికులకు వేతనాలు పెంచాలి



కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: జీవో నంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కోటిరెడ్డి సర్కిల్ నుంచి కడప మున్సిపల్ కార్పొరేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి పీవీ సుబ్బయ్య మాట్లాడుతూ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం అనేక రూపాల్లో నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. పెరిగిన ధరలు, విద్యార్థుల ఫీజుల వలన కుటుంబ పోషణ కష్టమై, ఇంటి బాడుగ కట్టుకోలేక కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నెల 4 వ తేదీన విజయవాడలో జరిగిన ధర్నాలో తాము సమ్మె ప్రకటించి, ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో తాము విధిలేని పరిస్థితుల్లో నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, క్యాడర్ స్ట్రెంగ్త్ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ప్రకటించాలన్నారు. తాము సమ్మె చేస్తుంటే వార్డు అమినేటిస్ సెక్రెటరీ లతో పని చే యించుకోవాలని చూస్తున్నారని, వాల్వ్‌లు తిప్పే క్రమంలో పైపులైన్ సమస్యలు వస్తే కమిషనరే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్ర రెడ్డి, గోపి, ఆనంద రావు, బ్రహ్మానంద రెడ్డి, కేశవులు, సుబ్బారాయుడు, గురువయ్య, గోవర్ధన్, చాపయ్య పాల్గొన్నారు.

వానపాము ఎరువులో అధిక పోషక విలువలు



వానపాము ఎరువు తయారీకేంద్రంలో శాస్త్రవేత్త సాయి మహేశ్వరి

పులివెందుల రూరల్: వానపాముల ఎరువులో అధిక పోషక విలువలు ఉంటాయని, పంట దిగుబడి నాణ్యత పెరుగుతుందని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని చిన్నకొండారెడ్డి కాలనీకి చెందిన పాలెం చంద్ర నిర్వహిస్తున్న వానపాముల ఎరువుల తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడటంతో భూసారం, సమతుల్యత తగ్గిపోతోందని, రైతులు సేంద్రీయ ఎరువులపై ఆసక్తి చూపాలని సూచించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రాథమిక సహకార సంఘం ప్రతినిధులకు శిక్షణ నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా వానపాముల ఎరువు తయారీ కేంద్రాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి మాట్లాడుతూ పాలెం చంద్ర గత పదేళ్లుగా వాన పాము ఎరువు ఉత్పత్తి చేస్తున్నారని, 2019లో కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా వానపాముల తయారీపై సాంకేతిక శిక్షణ, మెలకువలు, నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. యువ రైతులు వ్యవసాయం, ఇతర అనుబంధ రంగాలలో వ్యాపార అభివృద్ధిని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు



ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు

పులివెందుల రూరల్: మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు సౌకర్యాలు కరవవుతున్నాయి. పూడ్చిపెట్టేందుకు వెళ్తే అక్కడి వాతావరణం భయపెడుతోంది. పట్టణంలోని మెయిన్ బజార్ సమీపంలోని శ్మశాన వాటిక పరిస్థితి ఇదీ.. ఇక్కడ పిచ్చి మొక్కలను ఏపుగా పెరిగాయి. మృత దేహాలను పూడ్చేందుకు వచ్చిన వారంతా శ్మశాన వాటిక నిండా పిచ్చి మొక్కలు చూసి ఆవేదన చెందుతున్నారు. అంతేగాక ఎవరైనా మృతిచెందితే వారి బంధువులు ఇక్కడికి వచ్చి పూడ్చిపెట్టిన మృత దేహాలు ఏడాది తర్వాత వచ్చి చూస్తే ఉండడం లేదని స్థానికులు తెలిపారు. శ్మశాన వాటిక ఇలా ఉంటే చనిపోయిన బంధువులు, స్నేహితులను ఎలా పూడ్చాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జయంతి, వర్ధంతి వేడుకలప్పుడు సమాధుల వద్దకు వచ్చి పూజ చేయాలంటే చాలా ఇబ్బందికరంగా ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అంతేగాక పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండి ఉండడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉక్కు పరిశ్రమ హామీ అమలు కోరుతూ చలో ఢిల్లీ



పోస్టర్లు విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు: కడపలో ఉక్కు పరిశ్రమ హామీ అమలు కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పది రోజుల్లో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని మహానాడులో చంద్రబాబు చెప్పినా, నేటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. పార్లమెంట్‌లో తీర్మానం చేసిన విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలుచేయకపోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారిపై ఒత్తిడి తీసుకువస్తే కచ్చితంగా ప్రత్యేక హోదా సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, అరుణ్, కృష్ణారెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి వివాదంపై మహిళల నిరసన



మాట్లాడుతున్న సీఐ బాలమద్దిలేటి

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని పెద్దశెట్టిపల్లెలో ఉన్న ఎస్సీ కాలనీలోని రహదారి వివాదానికి సంబంధించి మహిళలు రూరల్ పోలీస్‌స్టేషన్ ముందు శనివారం నిరసనకు దిగారు. గ్రామంలో కొన్ని రోజుల నుంచి వెంకటసుబ్బయ్య, దయానిధిల మధ్య సిమెంట్ రోడ్డుకు సంబంధించి వివాదం నడుస్తోంది. ఈ విషయమై వీరి మధ్య పలుమార్లు గొడవలు జరుగగా పోలీసులు కేసు నమోదు చేశారు. ముందు జాగ్రత్తగా ఇరువురిని బైండోవర్ కూడా చేశారు. ఈ క్రమంలో రహదారిలో తిరగనివ్వలేదని, తమకు న్యాయం చేయాలని డిమాండు చేస్తూ శనివారం స్టేషన్ ముందు మహిళలు ఆందోళనకు దిగారు. రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా తమకు న్యాయం జరగలేదని వారు వాపోయారు. సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ నాయకుడు సాల్మన్‌లు మహిళలకు మద్దతుగా నిలిచారు. అదే సమయంలో సీఐ బాలమద్దిలేటి స్టేషన్‌కు రాగా మహిళలు వాహనానికి దారి ఇవ్వలేదు, దీంతో సీఐ బాలమద్దిలేటి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్యనారాయణ, సాల్మన్‌లు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న ఐదు అడుగుల స్థలం కోసం వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని సీఐ బాలమద్దిలేటి తెలిపారు. స్థలం ఎవరిదో తేల్చాలని రెవెన్యూ అధికారులకు చెప్పామని ఇంతలోనే స్టేషన్ ముందు ఆందోళనకు దిగారని చెప్పారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం. ఎవరైనా ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో పీసీపీఎన్‌డీటీ యాక్టుపై నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులలో అర్హత ఉన్న వారు మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. స్కానింగ్ మిషన్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకుని స్కానింగ్‌కు వచ్చే వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వైద్యులు, స్కానింగ్ సెంటర్ల యజమానులపై, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ జె.వినయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జింకా సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత జింకా సుబ్రహ్మణ్యం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని త్యాగరాజ గాన సభలో మనం ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా జింకా సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్, పద్మ ప్రతిభ జాతీయ పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి శ్రీరామమూర్తి, గ్రంథాలయ అధికారి మార్తెల శ్రీనివాసరావు, రైల్వే డివిజనల్ డీఎస్పీ సుబ్బారావు, పత్రికా సంపాదకుడు జాబిలి చాంద్ బాషా, వంశీ రామరాజు, దైవజ్ఞ శర్మ, రఘువీర ప్రతాప్, మనం ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అమాయకులపై కేసులు పెట్టడం దారుణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బాలిక అదృశ్యం అయ్యిందనే మానవతా దృక్పథంతో వేంపల్లె పోలీసు స్టేషన్ వద్దకు ముస్లిం వర్గానికి చెందిన పలువురు చేరుకున్నారే తప్ప వేరే ఉద్దేశంతో కాదని, పోలీసులు మాత్రం ముట్టడి చేశారనే కారణంతో అమాయకులపై కేసులు పెట్టడం సరైంది కాదని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆప్‌కి ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం వర్గానికి చెందిన పలువురు మిగతా వర్గాలకు చెందిన వారు కూడా పార్టీలను పక్కనపెట్టి పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి గుమికూడారే తప్ప వేరే ఉద్దేశంతో ఆ ప్రాంతంలోకి ఎవరూ రాలేదని చెప్పారు. పోలీసులు కూడా మానవతా దృక్పథంతో ఆలోచించి తగు న్యాయం చేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి ఇప్పటికే అదుపులోకి తీసుకున్న అమాయకులను విడిచి పెట్టాలని కోరారు.

ప్రజల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టవా

కడప ఎడ్యుకేషన్: ప్రజల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని రెవల్యూషనరీ మార్కిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌ఎంపిఐ) రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల రమణయ్య అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని కొప్పర్తి గ్రామ పంచాయితీలో గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇంటిస్థలాలను ఇచ్చి పక్కా గృహాలను గత ప్రభుత్వం నిర్మించిందన్నారు. అయితే ఆ కాలనీలో ప్రస్తుత ప్రభుత్వం సిమెంటు రోడ్లుకానీ, మంచినీటి సౌకర్యంగానీ, వీధిలైట్లను గానీ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, కడప నగర నాయకులు రమేష్, సుబ్బరాయుడు, మల్లారెడ్డి, రవి, లక్ష్మిదేవి, నాగమునెమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి దస్తగిరి రెడ్డి , కే శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని రామకృష్ణ నగర్ లో స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనంతరం ఇంటింటికి స్మార్ట్ మీటర్లు రద్దు స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో సీసుబ్బమ్మ, కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహ, కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫర్ ఏర్పాటు చేయండి సారూ!



నగర పాలక సంస్థలో అధికార వ్యవస అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని 34వ డివిజన్‌లో గత ఆరు నెలలుగా స్థానికుల నివాసాల్లో లో ఓల్టేజ్ సమస్య ఉంది. పలుమార్లు మునిసిపల్ అధికారులకు విన్నపాలు చేసినా కనికరించడం లేదని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

గుర్తింపులేని సర్టిఫికెట్లతో ప్రయోజనం ఏమిటి?



మాట్లాడుతున్న బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు

వేంపల్లె: ప్రభుత్వ గుర్తింపులేని పరీక్షలు నిర్వహించడం శోచనీయమని బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు రఘునాథరావు, ప్రసాదరావు అన్నారు. వేంపల్లె పట్టణంలో విలేకరులతో వారు శనివారం మాట్లాడుతూ రాష్ట్ర పురోహిత సమాఖ్య ఆధ్వర్యంలో కడపలో నిర్వహిస్తున్న అర్చక పరీక్షలకు ఎంతవరకూ గుర్తింపు ఉందన్న విషయం అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పీఠాధిపతులు అంటే అందరికీ గౌరవమని, అయితే ప్రభుత్వ నిబంధనలు అందరూ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కడపలో నిర్వహిస్తున్న అర్చక పరీక్షలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా? లేదా? అనేది అధికారులు తెలపాలని డిమాండ్ చేశారు. పరీక్షలు నిర్వహించే అధికారం ప్రభుత్వ శాఖలకు తప్ప, ఇతరులకు ఉండదని, సమాఖ్యల పేరిట నిర్వహించే పరీక్షకు ఎంత వరకు గుర్తింపు లభిస్తుందని వారు ప్రశ్నించారు.

దేవాదాయశాఖలో అర్చకుల ఉద్యోగాలకు అర్హులు అవుతారా అని ప్రశ్నించారు. పురోహిత సమాఖ్య ఆధ్వర్యంలో అర్చకుల సమావేశం జరపడం తప్పు కాదని, అయితే పరీక్షలు నిర్వహించడం మాత్రం నిబంధనలకు వ్యతిరేకమన్నారు. బ్రాహ్మణ జాతిని సమైక్యంగా నిలపడమే చైతన్య వేదిక లక్ష్యమని వారు పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటాం

జమ్మలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తే అడ్డుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి మనోహర్ అన్నారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్తు చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించమని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. లోకేష్ పాదయాత్రలో స్మార్టు మీటర్లు బిగిస్తే వాటిని పగుల గొట్టాలని ఇచ్చిన పిలుపును వారు మరచిపోయారని ప్రశ్నించారు. ప్రజలపై రెండు సార్లు విద్యుత్ ఛార్జీల భారం దాదాపు రూ.15,454 కోట్లు మోపారన్నారు. ట్రూఅప్ ఛార్జీలు రద్దుచేయాలని, స్మార్టు మీటర్ల బిగింపు వెంటనే ఆపాలని, సెకీ ఒప్పందం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. టైమ్ అఫ్ డే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసుదాసు, వినయ్‌కుమార్, దాసరి విజయ్, హుస్సేన్‌వలి, అబ్రహం, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇస్మాయిల్ స్వామి పీరు ఉత్సవం



ఉత్సవంలో ఇస్మాయిల్ పీరు



పీరు ఉత్సవంలో పాల్గొన్న జనం

సింహాద్రిపురం: మండలంలోని బిదినంచర్ల గ్రామంలో ఇస్మాయిల్ పీరు ఉత్సవం శనివారం వైభవంగా ముగిసింది. ఏటా ఈ పీరు ఉత్సవానికి ఇతర ప్రాంతాలలో స్థిరపడిన గ్రామస్తులు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో కులమతాలకతీతంగా కార్యక్రమం నిర్వహిస్తారు. శనివారం గ్రామ పురవీధుల గుండా ఉత్సవ పీరును డప్పు వాయిద్యాల నడుమ ఎంతో భక్తి శ్రద్ధలతో జలనిధికి తరలించారు. సింహాద్రిపురం మండలం, ఇతర మండలాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. గ్రామంలో యువకుల విచిత్ర వేషధారణ ప్రజలను ఆకట్టుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రవికుమార్ పర్యవేక్షించారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం



రోడ్డు నిబంధనలు వివరిస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కొండాపురం: రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కొండాపురం ఎస్ఐ యు.ప్రతాప్‌రెడ్డి అన్నారు. కొండాపురంలో వాహనాదారులకు శనివారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు ధరించాలని ఇన్సురెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని చెప్పారు. మద్యం తాగడం, సెల్ ఫోన్ చూడడం, నిద్రలేమి వంటి కారణాలతో డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో రోడ్డు ప్రమాదాల నుండి బయటపడతారన్నారు. తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కొండాపురంలో ఎస్‌బీఐ సర్కిల్, సీఎంఆర్ కాంప్లెక్స్ సర్కిల్ వద్ద నాలుగు వరుసల జాతీయ రహదారిలో దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.

మహా సభను విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు క్రైం : ఈ నెల 15న రాయచోటిలో నిర్వహించనున్న హిందుస్తానీ ఆవాం మోర్చా పార్టీ బహుజనుల రాజకీయ చైతన్య మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మహిళా నేతలు రాజేశ్వరి, లక్ష్మీ, కొత్తూరు కవిత తెలిపారు. శనివారం పీరు కొర్రపాడు రోడ్డులోని తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి జితన్ రామ్ మంజి, రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు, నేషనల్ ప్రెసిడెంట్ సంతోష్ సుమన్ హాజరు అవుతారన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.